ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 17-10.2025 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. బీసీ బిల్లును ఆమోదించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు.

2. కల్తీ పత్తి విత్తనాలను తయారు చేసే వాళ్లపై ఉక్కుపాదం మోపుతామని , అటువంటి వ్యాపారవేత్తలపై పీడీ యాక్టు పెట్టి జైల్లో పెడతామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి హెచ్చరించారు.

3. మావోయిస్టు అగ్రనేత తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ ఛత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి సమక్షంలో ఈరోజు పోలీసుల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు.

4. ఆపరేషన్ సిందూర్ సమయంలో, దేశం కఠిన సవాళ్ళనెదుర్కొన్నపుడు పోలీసు వ్యవస్థ సైనిక దళాలతో సమన్వయంతో పనిచేసిందనీ , సీమా సురక్షా బల్ డైరెక్టర్ జనరల్ దల్ జీత్ సింగ్ చౌదరి అన్నారు.

**భట్టి విక్రమార్క**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా అడ్డుకుంటుందని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. బిజెపి నైజం రాష్ట్ర ప్రజలకే కాదు దేశం మొత్తానికి తెలిసిందే నని ఆయన ఎద్దేవా చేసారు. రాష్ట్రం నుంచి అఖిలపక్షంగా వచ్చి రాష్ట్రపతిని ప్రధానమంత్రిని కలుస్తామని పదేపదే లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసిన కేంద్ర నుంచి అనుమతి రాలేదని ఆయన అన్నారు. ఉప ముఖ్య మంత్రి ఈ రోజు ఖమ్మం జిల్లా లో విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ఈనెల 18న రాష్ట్రంలో బిజెపికి వ్యతిరేకంగా జరుగుతున్న బీసీ బంద్ నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొనాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేసారు.

**బైట్ ... భట్టి విక్రమార్క**

కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి , బండి సంజయ్ రాష్ట్ర బిజెపి విభాగం అధ్యక్షుడు రామచంద్ర రావులు ప్రధాన మంత్రి నరేంద్ర మోది , బీసీ బిల్లు ఆమోదం కోసం సమయం తీసుకోవాలని ఈ విషయంపై వారు నాయకత్వం వహించాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు రాష్ట్రం నుంచి అఖిలపక్ష పార్టీలు బిజెపి నాయకత్వంలో ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాట్లు తెలిపారు. సింగరేణి సంస్థ కార్మికులకు దీపావళి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం 400 కోట్ల రూపాయల బోనస్ ప్రకటి ంచింది. దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ ప్రకటన పట్ల రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉప ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేసారు.

PTC

**పత్తి:**

కల్తీ పత్తి విత్తనాలను తయారు చేసే వాళ్లపై ఉక్కుపాదం మోపుతామని, అటువంటి వ్యాపారవేత్తలపై పీడీ యాక్టు పెట్టి జైల్లో పెడతామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి హెచ్చరించారు. పత్తి కొనుగోళ్లను సులభతరం చేసే విధంగా చర్యలు చేపట్టామని, జిల్లాస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీలు వేశామని , పత్తి రైతులు అవకతవకలపై ఫిర్యాదులు చేయొచ్చని మంత్రి చెప్పారు. కొద్ది సేపటి క్రితం మంత్రి హైదరాబాద్ లో కాటన్ కార్పొరేషన్ అధికారులతో సమీక్షించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పూర్తి స్థాయిలో PI పత్తిని కేంద్ర ప్రభుత్వ కాటన్ కార్పొరేషన్ సీకరిస్తుందని , రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రాష్ట్రంలో 22 లక్షల రైతులు 43.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని చెప్పారు.

**సౌండ్ బైట్ - కిషన్ రెడ్డి**

పత్తి రైతుల ప్రయోజనం కోసం , కపాస్ కిసాన్ యాప్ ను దేశ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో అందుబాటులోకి తెచ్చినట్లు , దీపావళి తర్వాత ఈ యాప్ లో నమోదు చేసుకోవాలని మంత్రి కోరారు.

MSL

**ఆశన్న**

మావోయిస్టు అగ్రనేత , పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ ఛత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి సమక్షంలో

పోలీసుల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద లొంగుబాటు. వారిలో 110 మంది మహిళలు , 98 మంది పురుషులు ఉన్నారు. 153 ఆయుధాలు అప్పగించగా.. వీటిల్లో 19 ఏకే- 47 రైఫిళ్లు , 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు ఉన్నాయి.

**డెస్క్**

**కేబినెట్**

రాష్ట్రంలో ఖరీఫ్ పంట దిగుబడిలో వందశాతం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. కొనుగోలు సమయంలోనే సన్నవడ్లకు 500 రూపాయల బోనస్ కూడా చెల్లించాలని నిన్న జరిగిన సమావేశంలో తీర్మానించింది. అలాగే , స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి ముగ్గురు పిల్లలు ఉంటే అనర్హులంటూ అమలవుతోన్న నిబంధనను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ సంస్థ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అంశంపై ఉన్నతాధికారులతో కమిటీ వేయాలని , మంత్రివర్గ ఉపసంఘం చేసే సిఫార్సుల ఆధారంగా తుది నిర్ణయం తీసుకోవాలని కేబినెట్ తీర్మానించింది. హుజుర్‌నగర్ , కొడంగల్, నిజామాబాద్‌లలో అధునాతన సౌకర్యాలతో అగ్రికల్చర్ కాలేజీలను ఏర్పాటు చేసేందుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

డెస్క్

**జూబ్లీహిల్స్**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు, ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయిల్ ( VVPAT) ల మొదటి రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యిందని జిల్లా ఎన్నికల అధికారి , జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలియజేశారు. నియోజకవర్గంలోని 407 పోలింగ్ కేంద్రాల కోసం మొత్తం 569 బ్యాలెట్ యూనిట్లు, 569 కంట్రోల్ యూనిట్లు, 610 VVPATలు కేటాయించినట్లు కర్ణన్ వెల్లడించారు.

డెస్క్

**విద్యుత్ లైన్లు**

వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా అటవీ ప్రాంతంలో విద్యుత్ లైన్లు ఉండకుండా చూడాలని ఆసిఫాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ , పోలీసు సూపరింటెండెంట్ కాంతిలాల్ పాటిల్ సూచించారు. విద్యుత్ అధికారులతో వైల్డ్ లైఫ్ టాస్క్ ఫోర్స్ టీం నిర్వహించిన సమావేశంలో పాల్గొని వారు మాట్లాడుతూ.. రిజర్వ్ ఫారెస్ట్ లో ఉన్న విద్యుత్ వైర్లు తొలగించి రెవెన్యూ భూమిలో నుండి వేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

పీటీసీ, ఆసిఫాబాద్

**ట్రామా**

ఈరోజు వరల్డ్ ట్రామా డే (ప్రపంచ గాయం దినోత్సవం)గా జరుపుకుంటున్నారు. గాయం వల్ల కలిగే బాధల గురించి అవగాహన పెంచడం, గాయాల నివారణ చర్యల ప్రాముఖ్యతను తెలియజేయడం , బాధితులకు మద్దతు ఇవ్వడం , నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈరోజు ముఖ్య ఉద్దేశ్యం. ఈ రోజును 2011లో ట్రామా అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రారంభించింది. ప్రమాదాలు ,

ప్రకృతి వైపరీత్యాలు , హింస వంటి వివిధ రకాల గాయాల ప్రభావాల గురించి ప్రజలకు తెలియజేయడం ఈరోజు లక్ష్యంగా ఉంది.

డెస్క్

**NPA:**

ఆపరేషన్ సిందూర్ సమయంలో , దేశం కఠిన సవాళ్ళనెదుర్కొన్నపుడు పోలీసు వ్యవస్థ సైనిక దళాలతో సమన్వయంతో కలిపి పనిచేసిందనీ , సీమా సురక్షా బల్ డైరెక్టర్ జనరల్ దల్ జీత్ సింగ్ చౌదరి అన్నారు. ఎలాంటి వివక్షా లేకుండా కర్తవ్య నిర్వహణకు అంకితం కావాలని మౌలిక శిక్షణ ముగించుకున్న IPS అధికారులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ లో 77 వ RR బ్యాచ్ IPS ప్రొబేషనర్ల పాసింగ్ అవుట్ పెరేడ్ ను సమీక్షించిన అనంతరం ఆయన ప్రసంగించారు. నూతన క్రిమినల్ చట్టలపై మెరుగైన అవగాహన ద్వారా సమాకాలీన సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాలను మెరుగు పరుచుకోవాలని అన్నారు. బలహీనుల స్వరంగా IPS అధికారులు మానవత్వంతో వ్యవహరించాలని కూడా సూచించారు.

(Soudnbyte-DG),

అంతకు ముందు కోర్స్ రిపోర్ట్ సమర్పించిన అకాడమీ డైరెక్టర్ అమిత్ గర్గ్ , IPS ప్రొబేషనర్లకు సమగ్ర శిక్షణ అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా 62 మంది మహిళలు సహా 174 మంది IPS ప్రొబేషనర్లు, 16 మంది మిత్ర దేశాల పోలీసు అధికారులు పెరేడ్ లో పాల్గొన్నారు.

-- MSL

**జాబ్ మేళా**

సూర్యాపేట జిల్లా హుజుర్ నగర్ లోని పెరల్స్ ఇన్ఫినిటీ స్కూల్లో ఈ నెల 25న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మెగా జాబ్ మేళారె నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. జాబ్ మేళా గురించి ఆయన మాట్లాడుతూ...

బైట్ - తేజస్ నందలాల్ పవార్, సూర్యాపేట జిల్లా కలెక్టర్...

పీటీసీ, నల్గొండ

**వాతావరణం**

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్నగర్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి , సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఈరోజు అక్కడక్కడా భారీ వర్షాలు కురవొచ్చని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఆయా జిల్లాలకు పసుపురంగు హెచ్చరిక జారీచేసింది. ఈరోజు నుంచి వచ్చే ఆరు రోజుల దాకా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియజేసింది. మరోవైపు, నైరుతి రుతుపవనాలు నిన్న మన రాష్ట్రం నుంచి , అలాగే మన దేశం నుంచి పూర్తిగా ఉపసంహరించబడ్డాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఇదే సమయంలో ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతదేశంలోకి నిన్న ఉదయం ప్రవేశించాయని వెల్లడించింది.

పీఎస్

**మద్దతు ధర**

ధాన్యం,  పత్తి,  మొక్కజొన్న తదితర పంటలను ప్రభుత్వ మద్దతు ధరలపై కొనుగోలు చేయడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని , పంటల కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

పీటీసీ, వరంగల్

**పోషణ**

మహిళల ఆరోగ్యం కోసం కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. పోషణ మాసంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పోషణ లోపం లేని సమాజం కోసం కృషి చేస్తున్న అంగన్వాడీ టీచర్లకు అభినందనలు తెలిపారు. గర్భిణీ ల పోషణలో కుటుంబ సభ్యులను అందరినీ భాగస్వాములను చేయాలని చెప్పారు.

పీటీసీ, నల్గొండ

**చైతన్యం**

కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు నిన్న రాత్రి రైల్వే స్టేషన్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ ఆధ్వర్యంలో నార్కోటిక్స్ డాగ్స్ బృందాలు కూడా 'చైతన్యం - డ్రగ్స్ పై యుద్ధం ' కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్ లో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం

అక్కడ పాల్గొన్న అధికారులు, సిబ్బంది, స్థానికులతో  చైతన్యం - డ్రగ్స్ పై యుద్ధం ప్రతిజ్ఞ చేశారు.

పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం